సాక్షి తిరుపతి

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



ఆకాశమే హద్దుగా అరాచకాలు

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆకాశమే హద్దుగా చంద్రబాబు అరాచకాలు చేస్తున్నారని భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. - 8లో



రక్తసిక్తం

నగరి సమీపంలోని జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో నలుగురు మరణించారు. - 8లో



గడ్డి మందు తిన్న చిన్నారి

ముట్టింబాక సమీపంలోని ఆక్వా చెరువుల వద్ద కాపలాదారు నరేష్ కుమార్తె వెంకటమ్మ(2) గడ్డి మందు తినింది. - 8లో

అరాచకాలు ఎండగడదాం



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి, భూమన తదితరులు

- వైఎస్సార్ సీపీ నేతలపై ఎల్లో మీడియా విషప్రచారం
- వైఎస్సార్‌సీపీలో పలువురు నేతలకు పదవులు
- అట్టహాసంగా ప్రమాణస్వీకారం

తిరుపతి మంగళం : అధికార దాహంతో నోటికి వచ్చినట్లుగా అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా, నగర, అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులు ప్రమాణస్వీకారం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, సతీష్‌రెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, కేజేఆర్ భరత్, భూమన అభినయ్‌రెడ్డి, సునీల్, రాజేష్, వెంకటేగౌడ, కృపాలక్ష్మి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు అలంకారప్రాయం కాకుండా పార్టీ బలోపేతానికి దోహదపడేలా ఆ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అన్నీ కష్టాలేనన్నారు. ప్రజాసమస్యలపై ప్రతి కార్యకర్త పోరాటయోధుడై ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో ఇదివరకు ప్రజాసంక్షేమమే లక్ష్యంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని గుర్తు చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నియోజకవర్గ అధ్యక్షులు

కార్యకర్తలే లక్ష్యంగా దాడులు

చంద్రబాబు కూటమి పాలన వచ్చిన నాటి నుంచి ప్రజాసంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ, అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీనీ నెరవేర్చిన పాపానపోలేదన్నారు. తల్లికి మొండి చేయి, తాగుబోతుకు ఫుల్ అందిస్తున్నారే తప్ప సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుపై ఎల్లో మీడియా ఎలాంటి వార్తలు రాయడం లేదని, ఎంతసేపు వైఎస్సార్ సీపీ నాయకులపై విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలిచి, చంద్రబాబు మోసాలను ఎత్తిచూపాల్సిన ఎల్లో మీడియా వారికి కొమ్ముగాస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా విద్యుత్ చార్జీలు పెంచారని, తల్లికి వందనం తగలపెట్టారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తుంగలో తొక్కేశారన్నారు. చివరకు శ్రీవారి లడ్డూ విషయంలో కూడా రాజకీయం చేసిన నీచుడు చంద్రబాబు అన్నారు. అందుకే తిరుమలలో అన్ని అపచారాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ పదవులు పొందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో భూమన కరుణాకరరెడ్డి

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ కొనసాగుతుంది. అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో జిల్లా వాసులు మీ సమస్యలను జిల్లా అధికారులకు తెలియజేయడానికి అవకాశం ఉంటుంది. అర్జీదారులు స్పష్టంగా తమ సమస్యను అర్జీల రూపంలో అధికారులకు అందించడమే కాకుండా నేరుగా వారితో మాట్లాడవచ్చు.

జాబ్ మేళా రేపు

తిరుపతి అర్బన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి లోకనాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మేళా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి లేదా ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న వారు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్‌మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతోపాటు సర్టిఫికెట్ల జెరాక్స్ తీసుకురావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9491458910 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి సంస్థతోపాటు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,871 మంది స్వామివారిని దర్శించుకోగా 24,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అధ్యాత్మిక పురి తిరునగరి.. ఈ నగర మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అలాంటి పదవుల్లో ఒకటైన డిప్యూటీ మేయర్ పదవిని బలం లేకున్నా కొట్టేయాలన్న తాపత్రయం.. అందుకోసం చేయని కుట్రలు లేవు.. తొక్కని అడ్డదారులు లేవు. హెచ్చరికలు.. బేరాలు.. బెదిరింపులు..దౌర్జన్యాలు.. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల అడ్డగింతకు కుట్రలు..కుతంత్రాలు.. చివరకు బుజ్జగింపులు.. బతిమలాటలు.. ఒకటేమిటి.. రకరకాల వికృత చేష్టలు చేస్తున్నారు కూటమి నేతలు. ఎన్ని ప్రయత్నాలు చేసిన కూటమికి భంగపాటు తప్పదంటున్నారు నిపుణులు.



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై సాయుధ దళాల దౌర్జన్యం(ఫైల్)

ప్రలోభాలు.. బెదిరింపులు

ఉపఎన్నికలో పాల్గొనకుండా ఉండేందుకు కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, వారి తల్లిదండ్రులు, మిత్రులు, బంధువుల ద్వారా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మరో వైపు మరోసారి బెదిరింపులకు దిగారు. పోలీసుల ద్వారా కూడా ఫోన్లు చేయించి బెదిరించినట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చేసేది లేక కూటమి నేతలు కాళ్లవేళ్లా పడుతున్నారు. ఉపఎన్నికలో పాల్గొంటే ఎవరికో ఒకరికి చేయి ఎత్తాలి. అలా ఎత్తితే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుంది. అలా కాకుండా ఉప ఎన్నికకు పాల్గొనకుండా ఉంటే చాలని ప్రాధేయపడుతున్నట్లు తెలిసింది.

కాలకూటమి కుట్ర

ప్లాన్–ఏ బెడిసికొట్టింది.. ప్లాన్–బీ అమలుకు యత్నం

- ఉపఎన్నికకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను అడ్డుకునే కుట్ర
- కార్పొరేటర్ల తల్లిదండ్రులు, బంధువులు, మిత్రుల ద్వారా పైరవీలు
- ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బేరం
- ఉన్నది ఒకే ఒక కార్పొరేటర్
- డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకోవాలని ఆరాటం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి కుట్రలు తారాస్థాయికి చేరాయి. ఒకే ఒక్క కార్పొరేటర్ బలంతో డిప్యూటీ మేయర్ పదవిని కొట్టేసేందుకు తొక్కని అడ్డదారులు లేవు.. చేయని ప్రయత్నాలు లేవు. నిన్నటివరకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగారు. 'అంతు చూస్తాం.. మీ ఆస్తులు ధ్వంసం చేస్తాం. కేసులు పెడుతాం' అని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. వారి బెదిరింపులకు లొంగకపోవడంతో అధికారాన్ని ఉపయోగించి.. ఆస్తులను ధ్వంసం చేయడం ప్రారంభించారు. అలా అడ్డదారిలో

ఎన్నికకు అడ్డుకునే కుయుక్తులు

ఉప ఎన్నిక సమయంలో హాజరైన కార్పొరేటర్ల సంఖ్య ఆధారంగా ఎవరికి ఎక్కువ మంది ఉంటే వారే విజయం సాధించే అవకాశం ఉంది. కూటమి నేతలతో అంటకాగుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బలంతో డిప్యూటీ మేయర్ పదవిని కైవసం చేసుకోవచ్చని పథకం వేశారు. అందు కోసం కూటమి నేతలంతా ఎవరికి వారు కార్పొరేటర్లను ఉపఎన్నికకు హాజరు కాకుండా అడ్డుకునేందుకు నానా రకాలుగా కుయుక్తులు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డిని కూటమి వైపు లాక్కున్నారు. వైఎస్సార్‌సీపీ కూటమి బెదిరింపులకు బెదరని వ్యక్తి అయిన లడ్డూ భాస్కర్ రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించి బరిలోకి దింపింది. తొలుత చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ప్లాన్ బీకి షిఫ్ట్ అయ్యారు. ఆ ప్లాన్ బీ కథాకమామిషేంటో చూద్దాం రండి. తిరుపతి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడంతో డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం జరగనున్న డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కోసం కూటమి నేతలు రకరకాల కుట్రలకు తెరలేపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు తిరుపతి కార్పొరేషన్ మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను లాక్కునేందుకు కుట్రలు పన్నింది. తిరుపతి కార్పొరేషన్‌లో ఒకే ఒక్క కార్పొరేటర్ బలం ఉన్న కూటమి నేతలు అత్యాశకు పోయి ఉన్న పరువు పోగొట్టుకుంటున్నారు. అస్సలు బలమే లేకపోయినా డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి నేతలు పాకులాడటాన్ని చూసి నగరవాసులు నవ్వుకుంటున్నారు. కూటమి నేతలు చేస్తున్న వికృత చేష్టలు చూసి 'ఔరా' అని ముక్కున వేలేసుకుంటున్నారు. నిన్నటి వరకు చేసిన ఆస్తుల విధ్వంస కాండ పూర్తిగా బెడిసికొట్టడంతో కూటమి నేతలు 'ప్లాన్–బి'కి పదునుపెట్టారు. డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే.

రాత్రంతా వేట

కార్పొరేటర్ల కోసం కూటమి నేతలు రాత్రంతా వేట సాగించారు. అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని కార్పొరేటర్ల బంధువులను బెదిరింపులకు దిగారు. బేరాలు ఆడడం, అరెస్టులు చేస్తామని హెచ్చరికలు జారీ చేయడం తదితరాలతో కొంత గందరగోళం ఏర్పడింది. కానీ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూటమి నేతలకు లొంగకుండా తప్పించుకుని తిరిగినట్లు సమాచారం.

కూటమి అభ్యర్థిగా ఆ ఒక్కడే

కార్పొరేషన్‌లో ఒకే ఒక్క కార్పొరేటర్‌తో సరిపెట్టుకున్న టీడీపీ.. డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలోనూ ఆ ఒక్క కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పోటీ చేయక తప్పడం లేదు. ఇతను ఖర్చు పెట్టలేరని, కూటమితో అంటకాగుతున్న వారిలో ఎవరో ఒకరిని ఉప ఎన్నికల బరిలో నిలిపేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. అయితే కూటమికి అధికారికంగా కార్పొరేటర్ ఉన్నది ఒక్కరే. ఆ ఒక్కరు మినహా మిగిలి వారెవరిని బరిలో నిలిపినా.. వారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థే అంటారే తప్ప కూటమి అభ్యర్థి అనరు కదా? అన్న అభిప్రాయానికి వచ్చారు. దీంతో కూటమి తరుపున డిప్యూటీ మేయర్ అభ్యర్థి దాదాపు ఆర్సీ మునికృష్ణే అని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇంకెవరిని బరిలో దింపినా కూటమికి ఏ మాత్రం ప్రయోజనకరంగా ఉండదనే అభిప్రాయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సోమవారం జరగనున్న డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో అధికారపార్టీ నేతలు ఎన్ని రకాల కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు చేసినా అంతిమ విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జేసీ, ఎన్నికల అధికారి శుభం బన్సల్



ఎన్నికల ప్రత్యేక సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి సిటీ: ఖాళీగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక సమావేశ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జేసీ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో జరగనున్న ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెనేట్ హాల్‌లో డిప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం 11 గంటలకు జరగనున్న నేపథ్యంలో సంబంధిత కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమయానికంటే ముందుగా ఎస్వీయూ సెనేట్ హాల్‌లో హాజరుకావాలని సూచించారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, ఐడీ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ సురేంద్ర, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య, కార్యదర్శి రాధిక, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఏఎస్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో సోమవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు అధ్యాపకుల ఉద్యోగోన్నతులకు సంబంధించి కేరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. వర్సిటీ పరిపాలనా భవనంలో సెలక్షన్ కమిటీ నేతృత్వంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 9 మంది ప్రొఫెసర్లు, 21మంది సీనియర్ ప్రొఫెసర్లు ఇంటర్వ్యూలకు హాజరు కానున్నారు.



తిరుమలలోని గ్యాలరీల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏటా మాఘ మాసంలో సప్తమినాడు మలయప్పస్వామివారు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. వాహనసేవలు తిలకించేందుకు వచ్చే భక్తులు చలికి, ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడకుండా నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు గ్యాలరీల్లో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ భక్తులకు టీ, కాఫీ, పాలు, మజ్జిగ, మంచినీరు, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర, పొంగలి అందించనున్నారు. వాహనసేవలను తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ మాడ వీధులను రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. ఎండలో నడిచేందుకు ఇబ్బంది పడకుండా తెల్ల రంగు వేశారు. భక్తులకు భద్రతకు టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు సేవలందించనున్నారు. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులకు విధులు కేటాయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎస్వీబీసీలో వాహనసేవలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సమస్యలపై సీఎంకు నేడు ఈమెయిల్ అస్త్రం

తిరుపతి సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, వర్క్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబుకు లక్షల ఈమెయిల్స్ పంపనున్నట్లు ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గంటపాటు ఔట్‌సోర్సింగ్ ఆప్కాస్ వర్క్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అందరూ ఒకసారిగా మెయిల్స్ పంపుతున్నామని తెలిపారు. ఆప్కాస్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, జీఓ నంబర్ 2ను సవరించి, ఔట్ సోర్సింగ్ ఆప్కాస్ ఉద్యోగులకు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు అధికారికంగా ప్రకటించాలని, ఉద్యోగస్తులందరికీ ఐడీ కార్డులు ఇవ్వాలి, సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలన్న అంశాలపై సీఎంకు మెయిల్స్ పంపనున్నట్లు తెలిపారు. ప్రతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీకాళహస్తి కూటమిలో అసమ్మతి కుంపటి

- మంత్రి అనగాని సమక్షంలోనే టీడీపీ, జనసేన వాగ్వాదం

శ్రీకాళహస్తి: పట్టణంలోని కూటమి పార్టీల మధ్య అసమ్మతి కుంపటి రగులుతోంది. తమకు కనీస గౌరవం ఇవ్వడంలేదంటూ జనసేన నేతలు బాహాటంగా పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా శనివారం శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించేందుకు విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద కొందరు జనసేన నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన ఇన్‌చార్జ్ వినుతకు కనీస గౌరవం ఇవ్వడం లేదని సమావేశానికి సైతం సమాచారం ఇవ్వలేదని వాపోయారు. ముక్కంటి ఆలయంలో కారు పార్కింగ్ టెండర్‌ను నిబంధనల ప్రకారం జనసేన కార్యకర్తలు దక్కించుకున్నప్పటికీ కొందరు టీడీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగా టెండర్లు అప్పగించకుండా అడ్డుకుంటున్నారని, జనసేన ఫ్లెక్సీలను చింపేస్తున్నారని తెలిపారు. ఈ సమయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కలుగజేసుకుని జనసేనలో వర్గ పోరు, నాలుగు గ్రూపుల మధ్య అంతర్గతంగా విభేదాలున్నాయని, దీన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రికి వివరించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. జనసేనలో ఓ వ్యక్తిని మాత్రమే టీడీపీ దగ్గరికి తీసి, మిగిలినవారిని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని జనసేన కార్యకర్తలు వాపోయారు. రెండు నెలల క్రితం తిరుపతిలో మంత్రి అనగాని సత్యప్రసాద్ శ్రీకాళహస్తి నియోజకవర్గంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో కూడా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినుత వర్గీయులు టీడీపీ పొత్తు ధర్మం పాటించడంలేదని తమను మనస్తాపానికి గురి చేస్తున్నారని అందరి సమక్షంలో మంత్రి ఎదుట బహిర్గతం చేశారు. అప్పట్లో మంత్రి చర్చలు జరిపి పరిస్థితిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అయితే ఎలాంటి మార్పు రాకపోవడంతో తాజాగా పురపాలక సంఘ కార్యాలయంలో మంత్రి ఎదుట జనసేన కార్యకర్తలు వాగ్వాదం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా శ్రీకాళహస్తి కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన మధ్య అసమ్మతి సెగ రగులుతున్న అంశం పురపాలకసంఘం కార్యాలయంలో జరిగిన సమావేశం వీడియోతో రెండు రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున్న వైరల్‌గా మారి తీవ్ర చర్చకు దారితీస్తోంది.

క్లుప్తంగా

సర్పంచ్ ఆత్మహత్య


సుబ్రమణ్యం(ఫైల్)

దొరవారిసత్రం: పంటకు వేసే గుళికలు తిని వేణుంబాకం సర్పంచ్ తామర్ల సుబ్రమణ్యం (56) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వేణుంబాకం ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వేణుంబాకం ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం వేణుబాకం పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా కుటుంబంలో ఏర్పడిన కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పాటు పంచాయతీ పాలన విషయంలో పలు ఇబ్బందులు తలెత్తడంతో చేసేదిలేక ఇంట్లో ఉన్న గుళికలు తిని కాలనీకి సమీపంలోని జామాల్ తోటలో మృతి చెందాడు. అటుగా వెళ్లిన కాలనీకి చెందిన కొందరు గుర్తించి చికిత్స నిమిత్తం ఆటోలో తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో 108 వాహనం ఘటన స్థలానికి చేరుకుని సుబ్రమణ్యం మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడు భార్యా పిల్లలు, బంధువులు బోరున విలపించడంతో కాలనీలో విషాదం నెలకొంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి


మృతదేహన్ని పరిశీలిస్తున్న సీఐ బాబి

నాయుడుపేటటౌన్: విధి నిర్వహణ అనంతరం ఇంటికి వెళ్లడానికి జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు పక్కన వేచి ఉన్న లారీ డ్రైవర్ పేన్నేపల్లి దశరథరామయ్య(40)ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను తెలుసుకున్నారు. సీఐ కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామానికి చెందిన దశరథరామయ్య లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణ అనంతరం ఆదివారం రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు పక్కగా నిలుచుని ఉన్నాడు. ఆ సమయంలో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రక్తసిక్తం!

ఆదివారం సెలవులకని వెళ్లివారు కొందరు, పెళ్లిళ్లకు, ఇతర వేడుకలకు వెళ్లినవారు మరికొందరు.. తిరుమలేశుడి దర్శనానికి వస్తున్న వారు ఇంకొందరు.. ఇలా అందరూ ఆ బస్సులోనే బయల్దేరారు. బస్సు కూడా ఎక్కేశాం.. ఇక హాయిగా గమ్యం చేరొచ్చని భావించారు. కానీ క్షణాల్లో ధాం అంటూ పెద్ద శబ్దం వచ్చింది. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. వెనుక కూర్చున్న నలుగురి ప్రాణాల్లో రెప్పపాటులో గాల్లో కలిసిపోయాయి. మరో నలుగురు గాయాలతో తడిసి ముద్దయ్యారు. ఇంకో ఎనిమిది మంది బస్సులోనే కుప్పకూలిపోయారు. వారిని చూసి ప్రయాణికులు హాహాకారాలు పెట్టారు. మొదలే చీకటి.. ఆపై పెను ప్రమాదం.. ఏం చేయాలో దిక్కుతోచక గుండెలు బాదుకుంటూ కన్నీళ్లు పెట్టారు. ఈ విషాద ఘటన నగరి మున్సిపల్ పరిధి, టూరిజం రెస్టారెంట్ సమీపం, జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రైవేటు బస్సును ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- నలుగురి మృతి
- నిశీధిలో ప్రయాణికుల హాహాకారాలు
- ఒకరి పరిస్థితి విషమం, నలుగురికి తీవ్రగాయాలు
- మరో 8 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులతో నిండిపోయిన నగరి ఏరియా ఆస్పత్రి

నగరి : నగరి సమీపంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రయివేటు బస్సును గుర్తుతెలియని భారీ వాహనం పక్క నుంచి ఢీకొట్టిడంతో పెను ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు మృత్యుఒడికి చేరారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. నగరి మున్సిపల్ పరిధి టూరిజం రెస్టారెంట్ సమీపం, జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి నగరి నుంచి తిరుపతికి వెళుతున్న ప్రైవేటు బస్సును గుర్తు తెలియని భారీ వాహనం పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడమాలపేట సీతారామాపురం గ్రామానికి చెందిన పార్థసారథి నాయుడు(62), రాజేంద్ర నాయుడు (60), తిరుపతికి చెందిన దినేష్(8), తిరుత్తణికి చెందిన కుమార్(60) మృతిచెందారు. తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన చెన్నమల్లై (55) పరిస్థితి విషమంగా ఉండగా, తిరుపతికి చెందిన సుబ్బరత్నమ్మ (42), భరత్ (40), తిరువళ్లూరుకు చెందిన సుధాకర్ (50) తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతికి చెందిన రాధాకృష్ణ, శెల్వి, నాగేంద్ర, ఊత్తుకోటకు చెందిన కె.మురళి, తిరువళ్లూరుకు చెందిన రుద్రమూర్తి, శివగిరికి చెందిన అనురాధ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

అతివేగమే కారణం!

అతివేగమే ప్రమాదానికి కారణమని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. బస్సు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో పక్కకు తిరగడం ఒక్కసారిగా ఏదో వాహనం గుద్ది, ధాం అంటూ శబ్దం వచ్చిందని బస్సు అద్దాలన్నీ పగిలి అందరూ చిందరవందరగా పడిపోయామని తెలిపారు. ప్రతిరోజూ టైమింగ్‌కు వెళ్లాలంటూ ప్రైవేటు బస్సులు వేగంగానే వెళుతున్నాయని వారు ఆరోపించారు.

నాన్నా లేరా అమ్మని వచ్చాను!

నాన్నా లేరా అమ్మని వచ్చాను..! అంటూ ఓ బాలుడి మృతదేహం వద్ద తల్లి పడిన ఆరాటం కదిలించింది. బిడ్డా కానరాని లోకాలకు వెళ్లిపోయావా..? అంటూ కన్నీరుపెట్టం అందరినీ కలచివేసింది. బస్సులో తన ఒడిలో పడుకొని నిద్రిస్తూ వచ్చిన కుమారుడు శాశ్వత నిద్రలోకి వెళ్లిపోవడం తట్టుకోలేక ఆమె స్పృహ తప్పిపడిపోవడంతో వైద్యులు ప్రత్యేక చికిత్స అందించారు.


విలపిస్తున్న మృతుడు దినేష్ తల్లి

వేగంగా స్పందించిన వైద్యులు

క్షతగాత్రులకు వేగంగా వైద్యసేవలందించడంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రశంసలు అందుకున్నారు. మెడికల్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంవో, వైద్యులు అందరూ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని వైద్యసేవలందించారు. పోలీసులు కేసు నమోదుచేసి ఢీకొన్న వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రక్తంతో తడిసి ముద్దయిన నగరి ఆస్పత్రి


క్షతగాత్రులను రుయాకు తరలిస్తున్న వైద్యసిబ్బంది

క్షతగాత్రులు తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరుకోవడం.. వారిని స్ట్రెచర్లలో అటూ ఇటూ తీసుకెళ్లడంతో వార్డులంతా రక్తసిక్తమైంది. ఆ ప్రాంతంలో ఉన్నవారు అక్కడి పరిస్థితిని చూసి తట్టుకోలేక బయటకు పరుగులు తీశారు.


పరిస్థితి విషమంగా ఉన్న చెన్నమల్లై


తీవ్రగాయాలపాలైన సుబ్బరత్నమ్మ





మృతులు పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు, దినేష్, కుమార్

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిల్లకూరు: మనస్తాపం చెందిన ఓ వివాహిత పలు రకాల మాత్రలను మింగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం తిక్కవరంలో చోటు చేసుకుంది. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన మానస అనే వివాహితకు కొంతకాలంగా భర్తతో మనస్పర్థలు ఉన్నాయి. దీంతో వారిద్దరి మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె పలు రకాల మాత్రలు మింగి, అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు గుర్తించి ఆమెను 108 ద్వారా చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించాలన్నారు. ఈ విషయమై పోలీసులు తమకు సమాచారం అందలేదన్నారు.

గడ్డి మందు తిన్న చిన్నారి

– బాలిక ఆరోగ్య పరిస్థితి విషమం

వాకాడు: మండలంలోని ముట్టెంబాక సమీపంలోని ఆక్వా చెరువుల వద్ద కాపలా ఉంటున్న డి నరేష్ కుమార్తె ఎం వెంకటమ్మ(2) ఆదివారం రొయ్యల చెరువు గట్ల గడ్డి పెరగకుండా వాడే మందును తినేసింది. దీంతో ఆ బాలిక పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల కథనం మేరకు.. చిట్టమూరు మండలం గునపాడు గిరిజన కాలనీకి చెందిన డి నరేష్ భార్యపిల్లలతో కలసి కొంత కాలంగా ముట్టెంబాక సమీపంలోని ఓ రైతుకు చెందిన రొయ్యల చెరువుల వద్ద కాపలా ఉంటున్నాడు. అయితే తల్లిదండ్రులు రొయ్యల చెరువుల గట్లపై తమ పనిలో నిమగ్నమైన సమయంలో అభం శుభం తెలియని చిన్నారి తన పూరి గుడెసెలో ఓపెన్ చేసి ఉంచిన గడ్డిమందును తినేసింది. అపస్మారక స్థితికి చేరకున్న తన కుమార్తెను గుర్తించిన తల్లిదండ్రులు హుటా హుటిన వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చిన్నారిని గూడూరుకు తరలించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేని సమాచారం.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు


తిరుమలకు కూరగాయలను పంపుతున్న వాహనం ముందు దాత, శ్రీవారి సేవకులు

పలమనేరు : కర్నాటక రాష్ట్రం వడ్డిపల్లి కూరగాయల మార్కెట్ నుంచి శ్రీవారి భక్తులు రథ సప్తమి సందర్భంగా టీటీడీ నిత్యాన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలను ఆదివారం టీటీడీ వాహనంలో తరలించారు. ఆ వాహనానికి పూజలు చేసి గోవిందనామస్మరణల మధ్య అక్కడి నుంచి తిరుమలకు తరలించారు. శ్రీవారి భక్తులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి మిత్ర బృందం పాల్గొన్నారు. దాతకు వీరు కృతజ్ఞతలు తెలిపారు.

కత్తితో భార్యను పొడిచి..తాను పొడుచుకున్నాడు

- భార్యభర్తలిద్దరికి నెల్లూరులో చికిత్స


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సురేష్


గాయపడిన లత

నాయుడుపేటటౌన్: భార్యను కత్తితో పొడిచి, అదే కత్తితో భర్త పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నాయుడుపేట కుమ్మరి వీధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట కుమ్మరివీధిలో అవగోళ సురేష్ , లత దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలసి నివాసం ఉంటున్నారు. సురేష్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆ పనికి సక్రమంగా పోకపోవడంతో లత పుట్టింటి వెళ్లి వెంకటగిరిలో ఫ్రైడ్‌రైస్ దుకాణం పెట్టుకుంది. అక్కడ కూడ భర్త సక్రమంగా ఉండకపోవడంతో అక్కడ నుంచి తిరిగి నాయుడుపేటకు తిరిగి వచ్చి ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది. భార్య మీద కోపంతో మద్యం మత్తులో ఉన్న సురేష్ ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని భార్య లతపై దాడి చేసి గాయపరిచాడు. సురేష్ కూడ అదే కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వారిద్దరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ బాబి ఆస్పత్రికి చేరుకుని బాధితురాలు లతను సంఘటన గురించి తెలుసుకున్నారు. వారిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చదవలేదని చితకబాదాడు

- అన్న కుమార్తెను కొట్టిన తమ్ముడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


గాయపడిన జాను


ఏడుస్తున్న జాను

చిట్టమూరు: తన అన్న కుమార్తె, కుమారుడు బాగా చదవడం లేదని తమ్ముడు చిన్నారులను విచక్షణారహితంగా కొట్టిన సంఘటన చిట్టమూరు మండలం కోగిలి దళితవాడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిన్న బలరామయ్య కథనం మేరకు...కోగిలి దళితవాడకు చెందిన దామవరపు రాజయ్య, పోలమ్మ దంపతులకు జాను, నిత్య అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజయ్య, పోలమ్మలు శనివారం కూలి పనులకు వెళ్లారు. పోలయ్య తమ్ముడు ముత్యాలయ్య తన అన్న కుమార్తె, కుమారుడిని సాయంత్రం ఏబీసీడీలు చెప్పమని అడిగాడు. అయితే వారు చెప్పలేకపోవడంతో రాత్రి సమయంలో ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపునకు గడియ పెట్టి కర్రతో విచక్షణారహితంగా కర్రతో చితకబాదాడు. శరరమంతా తీవ్రగాయాలయ్యాయి. కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏడుస్తుండగా వారికి తగిలిన దెబ్బలు చూసి తల్లడిల్లిపోయారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలపై దాడి చేసిన ముత్యాలయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

తల్లి ఉత్తరక్రియలు జరిగిన 24 గంటల్లోనే కుమారుడి మృతి

వెంకటగిరిరూరల్: తల్లి ఉత్తరక్రియలు జరిగిన 24 గంటలు గడవకముందే కుమారుడు మృతి చెందారు. ఈ విషాదమైన ఘటన పట్టణంలోని బంగారుపేటలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు కథనం మేరకు.. బంగారుపేటకు చెందిన సజ్జా చంటమ్మ(72) రెండు వారాల కిందట మృతి చెందింది. ఈ క్రమంలో చంటమ్మ కుమారుడు సజ్జా వీరయ్య శనివారం సంప్రదాయ బద్ధంగా ఉత్తరక్రియలు నిర్వహించారు. పుణ్యస్థానాల నిమిత్తం శ్రీకాళహస్తి ఆలయానికి బయలు దేరారు. ఆదివారం తెల్లవారు జామున నుంచి వీరయ్యకు గుండెనొప్పిగా ఉందంటూ అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు. మరికొద్ది గంటలకు అక్కడ నుండి తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆ వైద్యశాలలో వీరయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలి


మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

కాణిపాకం: జర్నలిస్టు సమస్యలపై పోరాటం చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. కాణిపాకంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు, తిరుపతి జిల్లాల విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు లోకనాథం అధ్యక్షతన నిర్వహించారు. దీనికి సుబ్బారావుతోపాటు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కులప్ప, రాష్ట్ర కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, తిరుపతి అధ్యక్షులు ప్రసాద్, నాయకులు అక్కులప్ప, జిల్లా నాయకులు మురళీకృష్ణ, అశోక్‌కుమార్, చిత్తూరు, తిరుపతి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళీ, బాలచంద్ర, రమేష్, కాశేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా అరాచకాలు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన మేయర్ శిరీష, కార్పొరేటర్లు

- తిరుపతిలో లోకేష్ రెడ్‌బుక్ పాలన
- డిప్యూటీ మేయర్ పదవి కోసం నీచరాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపులు
- తిరుపతిలో మంత్రి అనగాని అరాచకాలు
- కూటమి నేతల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు
- మీడియా సమావేశంలో భూమన

తిరుపతి మంగళం : డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆకాశమే హద్దుగా చంద్రబాబు అరాచకాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి నాయకులకు బలం లేకపోయినా తమ పార్టీ కార్పొరేటర్లను బెదిరించి లోబరుచుకునేందుకు నీచరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా శేఖర్‌రెడ్డిని భయభ్రాంతులకు గురిచేసి లోబరుచుకున్నారన్నారు. అలాగే తమ కార్పొరేటర్లు అనీష్‌రాయల్, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, తిరుపతి మునిరామిరెడ్డి ఇళ్లను కూడ కూల్చుతామంటూ బెదిరింపు ఫోన్లు చేస్తున్నారన్నారు. అయితే వారి ఇళ్లు ఇంకా కూల్చేయలేదే అన్నట్లుగా ఈనాడు పత్రిక తమ అనీష్ రాయల్, అమరనాథ్‌రెడ్డి ఇళ్ల ఫొటోలతో వార్తలు ప్రచురించడం చంద్రబాబుకు ఎల్లోమీడియా ఎంతగా కొమ్ముగాస్తోందో తెలుస్తుందన్నారు. కూటమి నాయకులు ఎంత బెదిరించినా బెదిరేప్రసక్తేలేదని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతిలో తిష్ట వేసి ఎలాగైనా కూటమి అభ్యర్థిని డిప్యూటీ మేయర్‌గా చేసి లోకేష్ వద్ద మెప్పుపొందేందుకు మంత్రి చేస్తున్న అరాచకాలు, దుర్మార్గాలు, దౌర్జన్యాలు అన్నీ ఇన్ని కావన్నారు. ఎన్నికల సమయంలో లోకేష్ చెప్పిన రెడ్‌బుక్ పాలనను తిరుపతిలో చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిని మరింత పవిత్రంగా తీర్చిదిద్దుతామంటూ సనాతన ధర్మాన్ని కాపాడుతానంటూ ప్రగల్భాలు పలికిన సనాతన ధర్మ పరిరక్షకుడు పవనానందస్వామికి తిరుపతిలో మంత్రి సత్యప్రసాద్‌తో పాటు కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు కనబడడంలేదా? అని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కూటమి నాయకులు చేస్తున్న అకృత్యాలను కూటమిలోని బీజేపీకి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి ఖండించుకున్నారన్నారు.

లడ్డూ భాస్కర్‌రెడ్డిని గెలిపించుకుని తీరుతాం

తిరుపతిలో సోమవారం జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్‌రెడ్డిని డిప్యూటి మేయర్‌గా గెలిపించుకుని తీరుతామని భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. తమ కార్పొరేటర్లను ఎంతమందిని ఎన్నిరకాలుగా బెదిరించినా భయపడేప్రసక్తేలేదని, మెజారిటీ కార్పొరేటర్లు తమవైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తమ్ముడు గణేష్, పార్టీ నాయకులు నల్లాని బాబు, ఉదయ్‌వంశీ, పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం


రమేష్(ఫైల్)


ఆస్పత్రిలో రమేష్ మృతదేహం

సైదాపురం: ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన సైదాపురం మండలం కలిచేడు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సైదాపురం గ్రామంలోని పందిటి చినమస్తానయ్యకు చెందిన ఆటోలో అదే గ్రామంలోని మల్లారపు పోలయ్య, అతని కుమారుడు రమేష్ శనివారం దేవరవేమూరు గ్రామానికి వెళ్లారు. ఆటోలో తిరిగి స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. మార్గమధ్యంలోని కలిచేడు సమీపంలో పిల్లాగిని కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న మోటారు వాహనాన్ని ఢీకొని, ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లారపు పోలయ్య, పి చినమస్తానయ్యకు స్వల్పగాయాలయ్యాయి. మల్లారపు రమేష్(35) తీవ్రంగా గాయపడడంతో 108లో పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయమై వైద్యులు సైదాపురం పోలీసులకు సమాచారంను అందజేశారు.దీంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాల సేకరించి, కేసును నమోదు చేశారు.